

మాట్లాడుతున్న రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త దేవీప్రసాద్

# గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**ఈ నెల 16 నుంచి మండలంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం**

**బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త దేవీప్రసాద్**

న్యాల్‌కల్, అక్టోబర్ 13: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త దేవీప్రసాద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం న్యాల్‌కల్ మండలంలోని న్యామతాబాద్ గ్రామ శివారులోని ఎస్ఏస్వీ రెస్టారెంట్ కన్వెన్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని పార్టీ మండల నాయకులతోపాటు మండలంలోని న్యామతాబాద్, హుస్సేనగర్, చీకుర్తి, అమీరాబాద్, ముర్తుజాపూర్, కాకిజనవాడ గ్రామాల ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి న్యాల్‌కల్ మండలంలో ఎన్నికల ప్రచారం చేపట్టనున్నామన్నారు. మొదట రేజింతల్ సిద్ధి వినాయక ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, న్యామతాబాద్ నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నామన్నారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయని, మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యేగా కొనింటి మాణిక్‌రావును మరోసారి భారీ మెజార్టీతో గెలిపించేందుకు మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఎన్నికల ప్రచారాన్ని ప్రణాళికబద్ధంగా నిర్వహించాలన్నారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను ఇంటింటి వెళ్లి ప్రజలకు వివరించి చైతన్య పర్చేందుకు శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదులపల్లి శివకుమార్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని, ఆ దిశగా బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు రవికుమార్, నాయకులు పాండురంగారావు పాటిల్, నర్సింహారెడ్డి, భాస్కర్, చంద్రప్ప, బస్వరాజ్‌పాటిల్, ప్రవీణ్‌కుమార్, భూమారెడ్డి, హనీఫ్, శ్రీకాంత్‌రెడ్డి, దేవదాస్, విఠల్, వీరారెడ్డి, రామకృష్ణరెడ్డి, మాజీద్, మోహన్‌రెడ్డి, అప్పారావుపాటిల్, సర్పంచ్ శరణప్ప తదితరులున్నారు.

# పదేండ్ల ప్రగతిని వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, చిత్రంలో శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ తదితరులు

**తొమ్మిది వేల కోట్లతో పటాన్‌చెరు సమగ్రఅభివృద్ధి**

**నోట్ల కట్టల కాంగ్రెస్, మతతత్వ బీజేపీని తరిమి కొట్టండి**

**పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్ చెరు, అక్టోబర్ 13: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పదేండ్లలో చేపట్టిన ప్రగతిని గడపగడపకూ వివరించి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తలు, బూత్ కమిటీ నాయకులు, విద్యార్థి, యువత, సోషల్ మీడియా విభాగం ప్రతినిధుల సమావేశానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొమ్మిదివేల కోట్లతో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలంటే సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ విజయం ఎంతో కీలకమన్నారు. పదేండ్ల కాలంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని, ప్రగతిని, సంక్షేమ పథకాలను గడపగడపకూ వెళ్లి ప్రతి ఓటరుకు వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉన్నదన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న సంకుచితబుద్ధితో కాంగ్రెస్ పార్టీ డబ్బుల కట్టలు పంచేందుకు సిద్ధమవుతున్నదని ఆరోపించారు. అవినీతి కాంగ్రెస్, మతతత్వ బీజేపీలకు తెలంగాణలో స్థానం లేదన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు, అలజడులు సృష్టించేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నుతున్నాయని, బీఆర్ఎస్ కార్యకర్తలు, శ్రేణులు సంయమనంతో మెలగాలని కోరారు. శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు కార్యకర్తలే వెన్నెముఖని, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి తోడ్పాటు అందించాలని కోరారు.

**బీఆర్ఎస్‌లో చేరిన వావిలాల సర్పంచ్ నవనీత్‌రెడ్డి**

### బీఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్..

జిన్నారం మండలం వావిలాల గ్రామ సర్పంచ్ నవనీత్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గుమ్మడిదల మండలం అనుకుంట గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘం సభ్యులు తమ సంపూర్ణ మద్దతును ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

# పువ్వులను పూజించే గొప్ప పండుగ.. బతుకమ్మ

- **తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకోవాలి**
- **బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీశ్‌రావు**



సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 13 : నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు జరగనున్న బతుకమ్మ పండుగను పురస్కరించుకొని తెలంగాణ ఆడపడుచులకు మంత్రి హరీశ్‌రావు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నేడు ఎంగిలి పూలతో ప్రారంభమై తొమ్మిది రోజులపాటు తీరొక్క రంగులతో జరుపుకొనే బతుకమ్మ పండుగ ప్రారంభం సందర్భంగా జిల్లా ఆడపడుచులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలు, ఔన్నత్యానికి ప్రతీక బతుకమ్మ పండుగను 9 రోజుల పాటు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దేశంలోనే పూలను పూజించి, ప్రకృతిని ప్రేమించే గొప్ప పండుగ బతుకమ్మ అని.. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఈ గొప్ప పండుగ సందర్భంగా ఆడబిడ్డలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# తనిఖీల్లో పట్టుబట్ట మద్యం, నగదు





మునిపల్లి: కంకోల్ టోల్‌ప్లాజా వద్ద మద్యం, నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు

మునిపల్లి, అక్టోబర్ 13: వాహనాల తనిఖీల్లో అనుమతులు లేని మద్యం, ఆధారాలు లేని నగదును తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. శుక్రవారం మండల పరిధిలోని కంకోల్ శివారులో ముంబాయి జాతీయ రహదారిపై డెక్కన్ టోల్‌ప్లాజా వద్ద అసిస్టెంట్ కమిషనర్ కె.రఘురాం, మెదక్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాల ప్రకారం ఈ తనిఖీలు చేపట్టామని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. వాహనాల తనిఖీల్లో వివిధ విభాగాల్లో మూడు కేసులు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లు తరలిస్తే ఎంతటివారైనా సహించేదిలేదన్నారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేల కంటే ఎక్కువ వాహనంలో ఉండరాదన్నారు. కంకోల్ టోల్ ప్లాజా వద్ద నమోదైన కేసులు గురించి వివరిస్తూ కర్ణాటకకు చెందిన బస్సులో ప్రయాణిస్తున్న మహిపాల్ అనే వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.4,43,000లను స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అప్పగించినట్లు తెలిపారు. టెంపో ట్రావెల్స్ వాహనంలో వివిధ రకాల సుంకం చెల్లించని, గోవా రాష్ట్రానికి చెందిన (41 బాటిళ్లు) 45.7 లీటర్ల మద్యంతోపాటు వాహనంలో ఉన్న 13మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహనంలో పట్టుబడ్డవారంతా కరీంనగర్‌కు చెందిన వాళ్లుగా గుర్తించినట్లు తెలిపారు. కర్ణాటక బస్సులో ప్రయణిస్తున్న రాజప్పా అనే వ్యక్తి నుంచి 10.180 మిల్లీలీటర్ల పరిమాణం గల కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసుల తనిఖీల్లో మొత్తం లక్ష విలువ చేసే మద్యం, రూ.15లక్షల 43వేల నగదు ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు మోహన్ కుమార్, రమేశ్‌రెడ్డి, మధుబాబు, ఎస్సైలు అనిల్ కుమార్, స్వాతి, పృథ్వీరాజ్, విశ్వనాథ్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణ సజావుగా జరగాలి

**రిటర్నింగ్ అధికారి కార్యాలయం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శరత్**

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 13: జిల్లాలో ఎన్నికల నిర్వహణ సజావుగా జరగాలని సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం, అంబేద్కర్ మైదానం, స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. నామినేషన్ల స్వీకరణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రిటర్నింగ్ అధికారి రవీందర్‌రెడ్డికి సూచించారు. ఎక్కడ, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. అనంతరం ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ చేసేందుకు అంబేద్కర్ మైదానం, ఈవీఏంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచేందుకు అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారి రవీందర్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులున్నారు.



రిటర్నింగ్ అధికారి కార్యాలయం, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి శరత్